






ఆపరేషన్... అరాచకాలు

- గంజాయి మూలాలపై గురి
- నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ దాడులు
- అల్లరి గ్యాంగ్‌లను ఆటకట్టించే యత్నం
- పోలీసింగ్‌పై ఎస్పీ మార్కు
- ఎస్‌బీలో ప్రక్షాళన ● 12 మంది తొలగింపు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పోలీస్. ఒకప్పుడు పౌరుషంగా ఉండేది. అసాంఘిక శక్తుల పీచమణిచేది. కరుడుగట్టిన ఎర్రచందనం స్మగ్లర్లను కలుగులోంచి లాగి మరీ అరెస్టు చేసింది. నేరాల కట్టడిలో జిల్లా పోలీసు యంత్రాంగానికి మంచి ట్రాక్ రికార్డే ఉండేది. అయితే జగన్ ఐదేళ్ల పాలనలో పోలీసుశాఖకు మరక అంటింది. గత ప్రాభవాన్ని కోల్పోయింది. గతంలో పనిచేసిన అధికారుల నిర్వాకం వల్ల యంత్రాంగం నిస్తేజమైపోయింది. వైసీపీ నేతలు చెబితేనే కేసులు కట్టేది. వారి సిఫారసు ఉంటే తప్ప స్టేషన్ మెట్లు ఎక్కే పరిస్థితి జిల్లాలో కొన్ని చోట్ల ఉండేది. పోలీసు అంటేనే గతమంతా వైసీపీకి అనుకూలురనే అపవాదు జనాల్లో ఉండేది. అందుకే ఆ పాలనలో జిల్లాలో ఇష్టారాజ్యంగా అసాంఘిక శక్తులు పేట్రేగాయి. భూకబ్జాలు, రౌడీయిజం, గంజాయి, మట్కా, మట్టిమాఫియా, ఇసుక దోపిడీ ఇలా ఒకటేంటి సమాజానికి హానీకరమైన రుగ్మతలన్నీ అప్పట్లో వచ్చాయంటారు. అసాంఘిక శక్తులను కట్టడి చేయాలని కొందరు ఖాకీల్లో తపన ఉన్నప్పటికీ పై అధికారులు వైసీపీ నేతలతో అంటకాగడంతో కిందిస్థాయి సిబ్బంది కూడా పోలీసు, వైసీపీ బాయ్ బాయ్ అంటూ తాళం కలిపారు. అంతే జిల్లాలో గంజాయి, ల్యాండ్‌మాఫియా, ఇసుక, మట్టి మాఫియా ఇలా పలు వ్యసనాలకు అడ్డాగా మారింది. పోలీసులు అంటేనే లెక్కలేనితనం మారింది. ఇష్టారాజ్యంగా వీధికో గ్యాంగ్‌లు పుట్టుకొచ్చాయి. ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగడం, గంజాయి తోటకూరలా దొరికేది. ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాను గంజాయిలో ముంచెత్తి.. యువతను గంజాయి మత్తులో పడేసింది. అయితే రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రావడం,



రాత్రిపూట గస్తీ కాస్తున్న పోలీసులు



గంజాయి విక్రయదారులను అరెస్టు చేస్తున్న పోలీసులు (ఫైల్)

ముక్కుసూటిగా పేరొందిన హర్షవర్ధన్‌రాజును కడప ఎస్పీగా నియమించారు. ఆయన అనతికాలంలోనే తనదైన పోలీసింగ్‌ను చూపిస్తున్నారు. గంజాయిని నిర్మూలించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం. అందుకనుగుణంగానే అడుగులు పడుతున్నాయి.

జిల్లాలో ఇటీవల గంజాయిని కట్టడి చేసేందుకు నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ)తో కూడిన బృందం ఏర్పాటు చేశారు. ఆ బృందం తన పని మొదలుపెట్టింది. గంజాయి అమ్మకందారులు, రవాణాదారులను గుర్తించి దాడులు చేస్తోంది. డీఎన్‌సీసీ ఏర్పాటు చేసిన తరువాత ఇంత వరకు 33 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పలుకేసులు నమోదు చేసి ఇప్పటికే 12 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. వైజాగ్ ఏరియా నుంచి రైలు, ఇతర రవాణా మార్గాల ద్వారా గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించి దాడులు చేస్తున్నారు. ఇక మందుబాబులు ఆరుబయట మద్యం సేవిస్తున్నారు. 274 ప్రాంతాలను గుర్తించి.. అక్కడ ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ విషయం మందుబాబులకు తెలియడంతో అటు పక్కకు పోవడం లేదు. ఇక గంజాయి సేవించే పాడుబడ్డ భవనాలు, బుగ్గవంక పరివాహక ప్రాంతాలను గుర్తించి అక్కడ తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో గంజాయికి బానిసైలన వారు అటువైపు వెళ్లడం లేదని సమాచారం.

కడప పట్టణంలోని నాగరాజుపేట, మురళీ థియేటరు ప్రాంతం, రాజారెడ్డివీధి, ఎర్రముక్కపల్లె, వన్‌టౌన్, టూటౌన్ ఏరియాలో కొన్ని బ్యాచ్‌లు ర్యాష్ డ్రైవింగ్, తరచూ అల్లర్లకు పాల్పడుతూ జనాలను భయాందోళనకు గురి చేసేవారు. అయితే ఇప్పుడు అలాంటి చోట పోలీసు నిఘా ముమ్మరం చేశారు. రాత్రిపూట రక్షక్ వాహనంతో పాటు బ్లూకోల్ట్స్ పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. ఇక జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, పులివెందుల సున్నిత ప్రాంతాలు. ప్రొద్దుటూరుకు బిజినెస్ పరంగా పేరుంది. పులివెందుల మాజీ సీఎం సొంత గడ్డ. ఇక్కడ గతంలో జరిగిన అల్లర్లు, గొడవలను గుర్తించి.. నిఘాపెట్టడంతో పోలీసు ఫోర్స్ ఆప్రాంతాల్లో నిత్యం జనాలకు పోలీసులు కనిపించేలా ఉంటున్నారు. ఇక ఒక్కో ఏరియాకు రక్షక్ వాహనంతో పాటు ప్రత్యేక దళాలు బ్లూకోల్ట్స్‌తో రాత్రిపూట కవాతు నిర్వహిస్తున్నారు. ఉదయం పూట వాకింగ్, మార్కెట్ కోసం వెళుతుంటారు. తెల్లవారుజామున 4 నుంచి ప్రధాన ఏరియాలో గస్తీ ముమ్మరం చేస్తున్నారు. దీంతో అల్లర్లు జరిగే అవకాశాలు ఉండవు.



పాడుబడ్డ భవనాల్లో తిరుగుతున్న పోలీసులు

ఎస్‌బీలో ప్రక్షాళన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- 12 మంది లా అండ్ ఆర్డర్‌కు

కళ్లు చెవులులాంటి ఎస్‌బీ (స్పెషల్‌బ్రాంచ్) కొందరు తీరు వల్ల అచేతనంగా మారిపోవడం... రాజకీయ సిఫారసులతో మరికొందరు అసమర్థులు కూడా ఎస్‌బీలో తిష్ట వేశారు. ఈ విషయం ఆంధ్రజ్యోతిలో ఇటీవల 'ఎస్‌బీలో ఫ్యాన్ ఫ్యాన్స్. మినిట్ మినిట్ సమాచారం వైసీపీ నేతలకు అంటూ కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఎస్‌బీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. మొత్తం 47 మందిని బదిలీ చేశారు. వీరిలో 12 మందిని ఎస్‌బీ నుంచి పక్కనపెట్టేశారు. కడప, ప్రొద్దుటూరు టూటౌన్, త్రీటౌన్, రూరల్, పులివెందుల, సింహాద్రిపురం, ఎర్రగుంట్ల, బి.మఠం, వేముల, పెండ్లిమర్రి, బి.కోడూరు, పోరుమామిళ్లలో వేసిన వారిలో కొందరు ఏళ్ల తరబడి కొనసాగడం, అవినీతి ఆరోపణలు, రాజకీయ సిఫారసులు ఎస్‌బీకి అసమర్థులను గుర్తించి వారిని లా అండ్ ఆర్డరుకు పంపించేందుకు పోస్టింగులు ఇవ్వలేదు. ఇక మిగతా 30 మంది సిబ్బందిని స్టేషన్లు మార్చారు. చాల ఏళ్లతరువాత ఎస్‌బీలో తిష్టవేసిన వారిపై కొరడా ఝులిపించి హర్షవర్ధన్‌రాజు తన మార్కు పోలీసింగ్ చూపిస్తున్నారు. ఇటీవల ప్రజాప్రతినిధులు ఇతర నేతలకు సెక్యూరిటీని రివ్యూ కమిటీ సూచనల మేరకు పలువురికి గన్‌మెన్లను తొలగించగా మరికొందరికి సిబ్బందిని తగ్గించారు. అలా 80 మంది సిబ్బంది తిరిగి వెనక్కి వచ్చారు. అయితే వీరిని జిల్లాసరిహద్దు చెక్‌పోస్టుల్లో నియమించి.. చెక్‌పోస్టులను మరింత పటిష్టం చేస్తున్నారు. పోలీసులపై వైసీపీ మార్కు ఉన్న మరకను తొలగించేందుకు ప్రతి పోలీసు ఆఫ్ డే జనాలతో మమేకం కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చాలా రోజుల తరువాత మళ్లీ పోలీసింగ్ కనిపించిందంటున్నారు.

పంటకు ప్రాణం

- మెట్టపంటకు ఊపిరిపోసిన వరుణుడు
- రెండు రోజులుగా వర్షాలు
- కరువు పరిస్థితుల నుంచి కాస్త ఉపశమనం

కడప(రూరల్) ఆగస్టు 8: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మెట్టపంటలకు ప్రాణం పోసినట్లయింది. గత నెల రోజుల నుంచి వర్షాలు ముఖం చాటేయడంతో ఖరీఫ్‌లో మెట్ట పంట కింద సాగైన వేరుశనగ, పత్తి, సజ్జ, కొర్ర, కంది, మినుప తదితర పంటలు వాడుదశకు చేరాయి. ముద్దనూరు, వీరపునాయునిపల్లె, కమలాపురం తదితర మండలాల్లో చాలా వరకు పంటలను వదిలేసే పరిస్థితి వచ్చింది. ఇలాంటి తరుణంలో గత మంగళవారం నుంచి జిల్లాలో అడపాదడపా వర్షాలు పడుతుండడంతో రైతాంగంలో ఆశలు చిగురిస్తున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలో జూన్‌లో ఆశించిన దానికన్నా మెరుగైన వర్షాలు పడడంతో ఇందుకు తగ్గట్టుగా అన్నదాతలు మెట్టపంటలను సాగు చేశారు.

ఖరీఫ్ సాగు కింద 75,189 హెక్టార్లలో వివిధ పంటలు సాగు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 21,071 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 31,171 హెక్టార్లకు 4799 హెక్టార్లలో, కంది 3894 హెక్టార్లకు 739 హెక్టార్లలో, బ్లాక్ గ్రామ్ 2642 హెక్టార్లకు 3971 హెక్టార్లలో, వేరుశనగ 5971 హెక్టార్లకు 2496 హెక్టార్లలో, సోయాబీన్ 963 హెక్టార్లకు 258 హెక్టార్లలో, పత్తి 24086 హెక్టార్లకు 6362 హెక్టార్లలో సాగుకు నోచుకున్నాయి. పంటలు సాగు చేసినప్పటి నుంచి వర్షం జాడ లేదు. పైగా పడమటి గాలులు హోరెత్తటం...ఎండలు మండటంతో పంటలు వాడుదశకు చేరాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో మంగళ, బుధ, గురువారాల్లో కురిసిన వర్షాలతో రైతులకు కాస్త ఊరటనిచ్చింది. చేతికి రాకుండా పోతాయని భావించిన మెట్టపంటలకు ప్రాణం పోసినట్లయింది. మూడు రోజులుగా కురుసున్న వర్షాలతో వేరుశనగ, పత్తి, కంది, తదితర పంటలకు ఊపిరి వస్తోంది. ఖరీఫ్ ప్రారంభమైన జూన్ 1 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 233 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇందులో జూన్‌లో 68.2 మిల్లీమీటర్ల వర్షపాతం అవసరం కాగా 138.4 మిల్లీ మీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. జూలైలో 96.7 మిల్లీమీటర్ల వర్షపాతం అవసరం జూలై 6 వరకు 55.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తరువాత ఆగస్టు 6 వరకు ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదు. ఆగస్టు నెలలో 118 మిల్లీమీటర్ల వర్షపాతం అవసరం కాగా.. ఇప్పటి వరకు 30.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మెట్ట పంటలకు ప్రయోజనకరం

జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్‌లో సాగైన మెట్ట పంటలకు ప్రయోజకరమని జిల్లా వ్యవసాయధికారి ఏ.నాగేశ్వరావురావు తెలిపారు. ఖరీఫ్‌లో సాగైన పత్తి, వేరుశనగ, చిక్కుడు, మినుము, కంది తదితర పంటలు ముద్దనూరు, కమలాపురం, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల, సింహాద్రిపురం తదితర మండలాల్లో సాగు చేశారని.. సాగు అనంతరం నుంచి తగిన వర్షాలు లేకపోవడంతో వాడుదశకు వచ్చాయన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు ఉపయోగకరం అన్నారు. వీటితో పాటు ఇతర ఖరీఫ్ పంటలకు ప్రయోజనం కలిగిస్తాయని తెలిపారు.



వైఎస్ వివేకాకు ఘన నివాళి

పులివెందుల, ఆగస్టు 8: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి జయంతి సందర్భంగా ఆయన కుమార్తె వైఎస్ సునీత ఘన నివాళులు అర్పించారు. గురువారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో పులివెందులలోని వివేకా సమాధి వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు. వివేకా సతీమణి సౌభాగ్యమ్మ, కుమార్తె వైఎస్ సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, బావమరిది శివప్రకాష్‌రెడ్డి ఇతర కుటుంబ సభ్యులు సమాధిపై పూలు చల్లి నివాళులు అర్పించారు. అనంతరం ప్రార్థనలు చేశారు. ఇంటి వద్ద ఉన్న వివేకా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అలాగే లింగాల మండలం బోనాల గ్రామంలో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.



పులివెందులలో వైఎస్ వివేకా సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న కుమార్తె సునీత



లింగాల మండలం బోనాలలో వివేకా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 8: ఆకాంక్ష జిల్లాల ఆశయాలకు అనుగుణంగా అధికారులు జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ సీఈవో బీవీ ఆర్ సుబ్రమణ్యం ఆకాంక్ష జిల్లాల ఆశయ సాధనలో భాగంగా జిల్లాలో కార్యాచరణ, ప్రగతిపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2018లో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కొన్ని ఆకాంక్ష జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. రాష్ట్రంలో విజయనగరం, విశాఖ, కడప జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. అందులో భాగంగా ఆయా జిల్లాల్లో సామాజికస్థాయిని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యం, పోషకాహారం, విద్య, నైపుణ్యాభివృద్ధి, గృహ నిర్మాణం, వ్యవసాయం, పశుపోషణ, మౌలిక సదుపాయాలు మొదలైన శాఖల్లో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, వెంకట్రావు, డాక్టర్ నాగరాజు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

సహనం, సానుకూలతతో.. సమస్యలు పరిష్కారం

అర్జీదారులు, ఫిర్యాదుదారుల పట్ల సహనం, సానుకూల దృక్పథంతో స్పందించగలిగినపుడే అధికారులు ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలరని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. ఇటీవల అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో సమీక్షించిన అంశాలపై గురువారం కలెక్టరేట్‌లో జేసీ అదితిసింగ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డిలతో కలసి అధికారులతో పంచుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సమాచారం అందిపుచ్చుకోవడంలో అధికారులు అందుబాటులో ఉండాలని.. ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ రాకూడదన్నారు. మనం చేసే ప్రతి పని ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా ఉండాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే ముందు ప్రణాళికతో వెళ్లాలని.. అవసరమైన చోట్ల ఆకస్మిక తనిఖీలు కూడా చేపట్టాలని.. అప్పుడే మంచి ఫలితాలు అందుకోగలమన్నారు. జిల్లాలో పచ్చదన పర్యావరణ పరిరక్షణలో భాగంగా 5 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ముందుకెళ్లాలన్నారు. జిల్లా జీఎస్‌డీపీ ప్రమాణాలను పెంచే విధంగా అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. ప్రతి బుధవారం మండల ప్రత్యేకాధికారులు, అధికారులు గ్రామదర్శన్ నిర్వహించాలన్నారు. అనంతరం ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగంగా శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, కర్తవ్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

పీఎం విశ్వకర్మ యోజనను ఉపయోగించు కోవాలి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనను జిల్లాలోని చేతి వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పీఎం విశ్వకర్మ యోజన పథకం అమలుపై అధికారులతో సమావేశం నిర్వహించారు.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- డీఆర్‌ఎం విజయకుమార్

కడప(ఎడ్యుకేషన్), ఆగస్టు 8: ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కడప రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజరు వి.జయకుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాధారణ తనిఖీల్లో భాగంగా కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ స్టేషన్ పథకానికి సంబంధించి పనులు పరిశీలించారు. కడప రైల్వేస్టేషన్ లోని అన్ని కార్యాలయాలను తనిఖీలు చేశారు. డిప్యూటీ స్టేషన్‌మాస్టరు కార్యాలయంలో ఉన్న సిగ్నల్ వ్యవస్థను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థ అనేది అత్యంత కీలకమైనదని, అన్నివేళలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే స్టేషన్‌లో ఎక్సిలేటరు, ఫుట్‌ఓవర్‌బ్రిడ్జ్ ఎక్కడ వస్తాయని సిబ్బందిని అడిగారు. గూడ్సు షెడ్డు వద్ద జరిగిన రోడ్డు పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ డీఎస్‌సీఈ చంద్రశేఖర్, సీనియర్ డీఎస్‌వో సూర్యనారాయణ, సీనియర్ డీవోయం శ్రావణకుమార్, సీనియర్ డీఈఎన్ మణికంఠ, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్థన్, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, ఏడీఈఎన్ రాధాక్రిష్ణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం విజయకుమార్

స్వాతంత్ర్య వేడుకలకు కోటిరెడ్డి కళాశాల విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సలీంబాషా

కడప(ఎడ్యుకేషన్), ఆగస్టు 8: కడపనగరం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బయో టెక్నాలజీ మూడోసంవత్సరం చదువుతున్న ఎల్.భువన ఢిల్లీ ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర్య వేడుకలకు ఎంపికైంది. ఈ విద్యార్థిని ఈ నెల 11న బయల్దేరి న్యూఢిల్లీలో జరిగే వేడుకలకు కడప జిల్లా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హాజరుకానుంది. ఈ వేడుకలకు కేంద్ర యువజన సర్వీసులు, క్రీడామంత్రిత్వశాఖ నుంచి విద్యార్థిని ఆహ్వానం అందుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సలీంబాషా, ఎన్ఎస్ఎస్ పీవో జి.విజయలక్ష్మిదేవి, డాక్టర్ శచీదేవిలు, ఇతర అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

గండికోట ప్రాజెక్టును పరిశీలించిన చీఫ్ ఇంజనీర్

- రేపు అవుకు నుంచి గండికోటకు కృష్ణాజలాలు

కొండాపురం, ఆగస్టు 8: గండికోట ప్రాజెక్టును జిల్లా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ మల్లికార్జునరెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టుకు మరో రెండు రోజుల్లో నీరు వచ్చే అవకాశం ఉన్నందున ఆయన ప్రాజెక్టును పరిశీలిచారు. ఇటీవల క్లస్టర్‌గేట్లకు మరమ్మతులు చేపట్టిన నేపథ్యంలో గేట్లను పరిశీలించారు. నీరు వచ్చేలోపు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే అవుకు రిజర్వాయిర్‌కు కృష్ణాజలాలు వస్తున్న నేపథ్యంలో అక్కడి నుంచి ఆదివారం నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు శ్రీనివాసులు, డీఈలు ఉమా మహేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గండికోట ప్రాజెక్టు గేట్లను పరిశీలిస్తున్న సీఈ మల్లికార్జునరెడ్డి

రామన్న చేతి నుంచి జాలువారిన అంజన్న


సకలపాప హరణం అంజన్న దర్శనం
రేపటి నుంచే శ్రావణ మాసోత్సవం



చక్రాయపేట, ఆగస్టు 8: రాయలసీమ జిల్లాల్లో ప్రసిద్ధ ప్రముఖ గండి క్షేత్రంలో శ్రావణ మాసోత్సవాలు అంగరంగ వైభవోపేతంగా జరగనున్నాయి. ఇక్కడి అంజన్న విగ్రహం స్వయానా శ్రీరామచంద్రుడు చిత్రించారు. ఇలాంటి స్వామిని దర్శించడంతో సకలపాపాలు తొలగి, అష్టఐశ్వర్యాలు సిద్ధిస్తాయని నమ్మకం. ఏటా గండి క్షేత్రంలో శ్రావణ మాసోత్సవాలు జరగడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మొదటి శ్రావణ శనివారం 10వ తేదీ, రెండో శనివారం 17న, మూడో శనివారం 24న, నాలుగో శనివారం 31వ తేదీ నిర్వహిస్తున్నారు. శ్రావణ మాసంలో గండి క్షేత్రం భక్తులతో కోలాహలంగా, విద్యుత్ అలంకరణలు, చలువ పందిళ్లు, చక్కభజనలు, కోలాటాలు, హరికథా కాలక్షేపాలు నిర్వహిస్తారు. ఉత్సవాలు తిలకించడానికి రాయల సీమ నుంచి భారీ ఎత్తున భక్తులు పాల్గొంటారు. పులివెందుల, రాయచోటి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప, కమలాపురం, కదిరి నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు.

గండి పేరు ఎలా వచ్చిందంటే...

గండి మొదలుకొని తిరుమల వరకు శేషాచలం అడవులు వ్యాపించాయి. ఇక్కడ ఉన్న కొం డకు ఎక్కడా తెగువ లేదు. గండి వద్ద రెండు కొండల మధ్య తెగువ ఏర్పడి ఉండడంతో ఈ ప్రాంతాన్ని గండి అని పిలుస్తారు. ఇక్కడ అంజన్న కొలువై ఉండడంతో గండి క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఈ కొండల నుడుమ అంజన్న కాళ్లుకడిగి పాపాఘ్ని నది ప్రవహిస్తోంది. ఫలితంగా ఈ నదిలో స్నానం చేసి అంజన్నను దర్శించుకుంటే సర్వపాపాలు తొలగి అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ పాపాఘ్ని నది కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా నందిగామ కొండల్లో పుట్టి అనంతపురం, చిత్తూరు జిల్లాలో ప్రవహించి జిల్లాలోని గాలివీడు మండలంలో కలుస్తుంది. ఇక్కడ రెండు కొండల నడుమ బంగారు మకర తోరణం ఏర్పాటు చేశారని అది పుణ్యాత్ములకు మాత్రమే కన్పిస్తుందని ప్రతీతి. గండి క్షేత్రాన్ని దర్శిం చుకున్న బ్రిటీష్ కలెక్టర్ సర్ థామస్ మన్రోకు ఆ మక ర తోరణం కనిపించిందని కడప గెజిట్‌లో పేర్కొన్నారు. ఈ క్షేత్రంలో 41 రోజులు నిద్రించి ఆంజన్నను పూజిస్తే అనుకున్న పనులు నెరవేరుతాయని నమ్మకం.



గండి క్షేత్రం వ్యూ (ఫైల్)

వైభవోపేతంగా ఉత్సవాలు నిర్వహిస్తాం

గండి క్షేత్రంలో జరిగే శ్రావణ మాసోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తామని దాదాపు రూ.20కోట్లతో ఆలయ నిర్మాణం, ప్రహరీ, రాజగోపురం, చక్కటి శిల్పనైపుణ్యాలతో దాదాపు 130స్తంభాలతో నిర్మిస్తున్నారు. గుడి నిర్మాణం అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం.

సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య

అంజన్న చరిత్ర

గండి ప్రాంతంలో అంజన్న కొలువై ఉండడానికి అనేక కథ నాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అందులో ఒకటి రావణాసురుడు సీతమ్మను అపహరించినపుడు రామలక్ష్మణులు లంకకు పయనమయ్యారు. మార్గమధ్యలో గండి సమీపాన వాయుదేవుడు నివాసం ఉండేవాడు. వాయుదేవుడు శ్రీరామ లక్ష్మణులను అక్కడ బసచేయమని కోరగా, తిరుగు ప్రయాణంలో మీ కోరిక తీరుస్తామని చెప్పి అక్కడి నుంచి వెళ్లారు. రాముడు, లక్ష్మణుడు లంకకు పోయి రావణా సురున్ని వధించి సీతతో తిరుగు ప్రయాణంలో రాముడు తిరిగి వస్తున్న విషయం తెలుసుకున్న వాయుదేవుడు గండి ప్రాంతంలో రెండు కొండల మధ్య మకర తోరణం కట్టి శ్రీరామచంద్రున్ని ఆహ్వానించారు. ఆ మకరతోరణం నేటికీ పుణ్యాత్ములకు దర్శనమిస్తుందని, జిల్లా గెజిట్‌లో రాయబడి ఉంది. అంతే కాకుండా ఇక్కడ అంజన్నకు సేవ చేస్తున్న పూజారికి కూడా మకరతోరణం కనిపించినట్లు డైరీలో రాసిపెట్టుకున్నట్లు పెద్దలు చెబుతున్నారు. సీతారామలక్ష్మణులు గండిలో ఒక రాత్రి బస చేసిన సమయంలో సీతమ్మజాడ కనిపెట్టి శ్రీరామునికి సహకరించిన ఆంజనేయులవారి జ్ఞాపకంగా ఓ చిత్రాన్ని గీయాలని సీతమ్మ శ్రీరాముల వారిని కోరింది. సీత కోరిక మేరకు శ్రీరాముడు గండి వద్ద కొండకు తన బాణపు ములికితో ఆంజనేయస్వామి చిత్రాన్ని చెక్కారు. తెల్లవారున జామున శుభఘడియలు దాటడంతో ఆంజనేయస్వామి చిటికిన వేలు చెక్కలేక పోయారు. భిన్నంగా స్వామికి పూజలు చేయ కూడదని వేలును చెక్కించడానికి శిల్పిని పిలిపించి చెక్కించబోగా ఆ వేలు నుంచి రక్తం కారింది. అందుకే ఆంజనేయస్వామి స్వామి చిరంజీవి అని ఆంజనేయస్వామి ఎక్కడ చూసిన కొలువై ఉంటాడని ప్రజల నమ్మకం.

ఖాజీపేటలో రెండు బైకులు చోరీ



బైకును తీసుకెళుతున్న దొంగ

ఖాజీపేట, ఆగస్టు 8: పరిధిలో ఏదో ఒక చోట దొంగలు దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఒకే నెలలో ఆరు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. ఏటీఎంలో దొంగతనానికి పాల్పడ్డారు. ఇలా చెప్పుకుంటూ పోతే మరెన్నో. గురువారం తెల్లవారుజామున కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పెట్రోలు బంకులో, కుమ్మరకొట్టాలులో దొంగలు పడ్డారు. రెండు చోట్ల స్కూటర్లను చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి డ్యూటీ చేసి మంచం పక్కనే స్కూటర్ పెట్టుకుని నిద్రిస్తుండగా స్కూటర్‌ను తీసుకెళ్లారు. స్కూటర్ పోయిందని సీసీ పుటేజీ చూడగా అందులో వ్యక్తి తీసుకెళుతున్నట్లు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమ్మరకొట్టాలులో ఇంటిముందున్న బైకును తీసుకెళ్లారు.

జిల్లాలో 63 మంది ఎస్‌ఐలకు స్థాన చలనం

కడప(క్రైం)ఆగస్టు8: ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న 63 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈమేరకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్పీ సిబ్బంది....

జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిలో 34 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే వారికి కేటాయించిన పోలీసుస్టేషన్ పరిధిలో విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం స్టేషన్	బదిలీ అయిన స్టేషన్
అమర్‌నాథ్ రెడ్డి	ఎస్‌పే కాశినాయన	కడప వన్‌టౌన్
మధుసూదన్ రెడ్డి	కడప వన్‌టౌన్	పెండ్లిమర్రి
ప్రదీప్‌నాయుడు	దిశ కడప	కడప తాలుకా
తాహీర్ హుస్సేన్	డీఎస్బీ కడప	కడప తాలుకా
మల్లికార్జున	కడప తాలుకా	వీఆర్ కడప
రాజరాజేశ్వర్ రెడ్డి	డీఎస్బీ కడప	కడప చిన్నచౌక్
రఫీ	చిన్నచౌకు కడప	ప్రొద్దుటూరు రూరల్
శివ ప్రసాద్	ప్రొద్దుటూరు రూరల్	ఒంటిమిట్ట
మధుసూదన్‌రావు	ఒంటిమిట్ట	లింగాల
క్రిష్ణయ్య	లింగాల	చక్రాయపేట
వినోద్‌కుమార్	చక్రాయపేట	దువ్వూరు
శ్రీనివాసులు	దువ్వూరు	ప్రొద్దుటూరు వన్‌టౌన్
మంజునాథ్	ప్రొద్దుటూరు వన్‌టౌన్	వీఎన్ పల్లి
సుభాష్ చంద్రబోస్	పెనగలూరు	రిమ్స్ కడప
హుస్సేన్	టి.సుండుపల్లి	కడప టు టౌన్
సిద్దయ్య	వీఆర్ కడప	కడప టు టౌన్
సంజీవ్ రాయుడు	కడప టు టౌన్	వల్లూరు
చిరంజీవి	ఎర్రగుంట్ల	సిద్దవటం
జయగోపాల్	వీఆర్ కడప	పీసీఆర్ కడప
అనిల్ కుమార్	సింహాద్రిపురం	పులివెందుల
తిరుపాల్ నాయక్	కడప తాలుకా	వేంపల్లి
తులసీ నాగ ప్రసాద్	రాజుపాళెం	సింహాద్రిపురం
పెద్దఓబన్న	సిద్దవటం	తొండూరు
లక్ష్మీనారాయణ	తొండూరు	వీఆర్ కడప
ప్రవీణ్ కుమార్	వేంపల్లి	వేముల

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం స్టేషన్	బదిలీ అయిన స్టేషన్
హైమవతి	ప్రొద్దుటూరు వన్‌టౌన్	వీఆర్ కడప
ధనుంజయుడు	వేముల	ప్రొద్దుటూరు టు టౌన్
రామక్రిష్ణ	ప్రొద్దుటూరు టు టౌన్	అట్లూరు
చప్పలరాజు	అట్లూరు	బి.కోడూరు
జయరాములు	బి.కోడూరు	రిమ్స్ కడప
నారాయణ	రిమ్స్ కడప	పులివెందుల
విష్ణు నారాయణ	పులివెందుల	ఎర్రగుంట్ల
భాస్కర్ రెడ్డి	ఎర్రగుంట్ల	ఆర్కే వ్యాలీ
రంగరావు	ఆర్కే వ్యాలీ	వేంపల్లి
వెంకటరమణ	వల్లూరు	రాజుపాళెం
యోగేంద్ర	కొండాపురం	ప్రొద్దుటూరు త్రీ టౌన్
జ్యోతి	ప్రొద్దుటూరు త్రీ టౌన్	సీసీఎస్ కడప
భాస్కర్	వీఆర్ కడప	ప్రొద్దుటూరు ట్రాఫిక్
సుబ్బారావు	వీఆర్ కడప	మైదుకూరు

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం స్టేషన్	బదిలీ అయిన స్టేషన్
రవికుమార్	బద్వేలు రూరల్	బద్వేలు
చిన్న పెద్దయ్య	ఓబుళవారి పల్లి	చాపాడు
చంద్రశేఖర్	టి.సుండుపల్లి	బి.మఠం
కొండారెడ్డి	చాపాడు	పోరుమామిళ్ల
చిరంజీవి	ప్రొద్దుటూరు రూరల్	కలసపాడు
హనుమంతు	తలమంచిపట్నం	ఎస్‌పే కాశినాయన
నాగమురళి	కలసపాడు	ఎర్రగుంట్ల
రామక్రిష్ణ	పెద్దముడియం	జమ్మలమడుగు
సుబ్బారావు	జమ్మలమడుగు	పెద్దముడియం
విద్యాసాగర్	బి. మఠం	కొండాపురం
తిమ్మోతి	వీఆర్ కడప	కలమల్ల
ప్రతాప్ రెడ్డి	చౌడేపల్లి (చిత్తూరు)	కమలాపురం
హృషీకేశ్వర్ రెడి	కమలాపురం	తాళ్ల ప్రొద్దుటూరు
బాల అంకయ్య	వీఆర్ కడప	డిఎస్‌బి కడప
మురళి మోహన్	వీఆర్ కడప	డిఎస్‌బి కడప
అరుణ్ రెడ్డి	వీఆర్ కడప	డిఎస్‌బి కడప
శ్రీనివాసులు	వీఆర్ కడప	దిశ కడప
ఎఎస్ఎన్‌కుమార్	వీఆర్ కడప	డిసిఆర్‌బి కడప
సంజీవరెడ్డి	వీఆర్ కడప	డిసిఆర్‌బి కడప
మరియన్న	వీఆర్ కడప	డిటిసి కడప
ప్రతాప్‌రెడ్డి	వీఆర్ కడప	కడప ట్రాఫిక్
సుబ్రమణ్యం	వీఆర్ కడప	కడప ట్రాఫిక్
అనసూయ	వీఆర్ కడప	దిశ కడప
రాఘవేంద్రారెడ్డి	ఇటుకల పల్లి (అనంతపురం)	ప్రొద్దుటూరు టు టౌన్

మైదుకూరు డీఎస్పీగా రాజేంద్రప్రసాద్



కడప (క్రైం), ఆగస్టు 8: మైదుకూరు డీఎస్పీగా కడప ఇంటెలిజెన్స్ డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్‌ను నియమిస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. 1995బ్యాచ్‌కు చెందిన ఈయన వైఎస్ఆర్ జిల్లాలోనే ఎస్‌ఐగా, సీఐగా పనిచేశారు. 2008లో సీఐగా, 2023 డిసెంబరు 23న డీఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం కడప ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తూ మైదుకూరు డీఎస్పీగా బదిలీ అయ్యారు.

సమర్థుడైన ఎస్‌ఐని నియమించాలి

- ఎస్పీకి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి లేఖ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8: పులివెందులలో సమర్థవంతమైన ఎస్‌ఐని నియమించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఎస్పీని లేఖలో కోరారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌ఐల బదిలీల్లో భాగంగా సింహాద్రిపురం ఎస్‌ఐగా ఉన్న అనిల్‌కుమార్‌ను పులివెందుల స్టేషన్‌కు బదిలీ చేశారన్నారు. ఇతను ఎన్నికల ముందు సింహాద్రిపురం ఎస్‌ఐగా వచ్చి ఎన్నికల ప్రచారంలో 'సైకో పోవాలి, సైకిలు రావాలి' పాటను మండలంలో ఎక్కడా పెట్టకుండా అడ్డుకున్న విషయం గుర్తు చేశారు. కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తూ బెదిరించారన్నారు. సాక్షాత్తు తనపైన తన కుటుంబ సభ్యులపైన దురుసుగా ప్రవర్తించి అవమానించాడని ఆరోపించారు. తమ గ్రామంలో ఓటర్లను కూడా టీడీపీకి ఓటు వేయవద్దని బహిరంగానే బెదిరించినట్లు ఆరోపించారు. ఇతని మీద తాను గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. అనిల్‌కుమార్‌రెడ్డి గతంలో పులివెందుల ఎస్‌ఐగా పనిచేశారని, అప్పుడు అతని అవినీతి అక్రమాలకు పాల్పడడంతో ఆ సమయంలో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించి చర్యలు తీసుకున్నారన్నారు. అర్హత లేకున్నా తన కుటుంబసభ్యుల పేరుపై తప్పుడు పత్రాలు సమర్పించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇన్నోవా కారు తీసుకున్నాడన్నారు. దీనిపై కూడా ఇతనిపై దర్యాప్తు చేశారని తెలిపారు. పులివెందుల వైసీపీ నేతలకు ఇతనికి అత్యంత సన్నిహిత వ్యాపార సంబంధాలున్నాయన్నారు. శాంతిభద్రతలు పరిరక్షించకుండా మట్కా, జూదాన్ని ప్రోత్సహించాడని ఇతని బదిలీని నిలిపివేసి సమర్థవంతమైన అధికారిని ఎస్‌ఐగా నియమించాలని విజ్ఞప్తి చేశారు.

ఓపెన్ స్కూల్స్ ద్వారా నమోదు శాతం పెంచండి

- అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



ఓపెన్ స్కూల్ కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీధర్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, ఆగస్టు8: టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయిన, చదువును మధ్యలో మానేసిన విద్యార్థులు, కార్మికులు వివిధ సంఘాల సభ్యుల సౌకర్యార్థం ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా కల్పించిన ఓపెన్ స్కూల్స్‌లో నమోదు శాతాన్ని పెంచాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీధర్, ఓపెన్ స్కూల్స్ అన్నమయ్య జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజుతో కలిసి ఓపెన్ స్కూల్ పరీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. అన్నమయ్య జిల్లాలో అక్షరాస్యతను పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. వివిధ కారణాల చేత బడి మానేసి, టెన్త్ ఫెయిల్ అయి 14 ఏళ్లు నిండిన వారు టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయి 15 ఏళ్లు నిండిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ చదివే అవకాశం ఉందన్నారు. ఓపెన్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్, ఇతర అధికారులు, విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించి, అన్నమయ్య జిల్లాను అక్షరాస్యత జిల్లాగా తయారు చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పాఠశాలల్లో ఇంటర్, టెన్త్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ పిలుపునిచ్చారు. గురువారం డీఈఓ కార్యాలయంలోని తన చాంబరులో అడ్మిషన్లకు సంబంధించిన బ్రోచర్‌ను ఆమె విడుదల చేశారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 27లోగా అడ్మిషన్లు పొందవచ్చన్నారు. డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న మైనార్టీ నేతలు, శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8: వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించి సెలక్ట్ కమిటీకి పంపాలని టీడీపీ ముస్లిం మైనార్టీ సంఘాలతో కలిసి పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వారు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉలేమా కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు ముక్తిఫరూక్, ఎంహెచ్ ఉలే మా ఎ హింద్ రాష్ట్ర కన్వీనరు మౌలా నా హుసేన్ అహ్మద్, మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటరు అబ్దుల్ గఫూర్, వక్ఫ్‌బోర్డు సీఈఓ అబ్దుల్‌ఖాదర్, టీడీ జనార్ధన్, పాల్గొన్నారు.

నవోదయ క్లస్టర్ గేమ్స్ చాంపియన్‌గా చిత్తూరు

మదనపల్లె టౌన్, ఆగస్టు 8: జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్‌వీ)లో నిర్వహించిన క్లస్టర్ గేమ్స్‌లో చిత్తూరు నవోదయ విద్యాలయ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. వలసపల్లె సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయలో రెండు రోజులుగా నిర్వహించిన క్లస్టర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో అనంతపురం, చిత్తూరు, కడప, కరైకల్, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం-1, ప్రకాశం-2, పుదుచ్చేరి జిల్లాలకు చెందిన 9 విద్యాలయాల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. గురువారం హర్డిల్స్, రిలే పరుగుపందెం, ఐదు కిలోమీటర్ల క్రాస్‌కంట్రీ, 5 కిలోమీటర్ల నడక పందేలు నిర్వహించగా చిత్తూరు జిల్లా జట్టు(మదనపల్లె నవోదయ విద్యాలయ) మొత్తం 451 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ దక్కించుకుంది. 84 పాయింట్లతో నెల్లూరు జేఎన్‌వీ ద్వితీయ స్థానం, 67 పాయింట్లతో తృతీయ స్థానంలో కడప జేఎన్‌వీ నిలిచింది. 12వ తేదీన మదనపల్లె జేఎన్‌వీలో నిర్వహించే హైదరాబాద్ రీజనల్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ) స్థాయి క్రీడా పోటీల్లో చిత్తూరు క్లస్టర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

మూడేళ్లు జైలు - జరిమానా

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 8: అమ్మాయిని వేధించిన కేసులో నిందితుడు పొట్టిపాటి శ్యామ్‌కు మూడేళ్ల జైలుశిక్ష, రూ. 8 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. 2019లో ఓ అవివాహితను అదే వీధికి చెందిన పొట్టిపాటి శ్యామ్ ప్రేమించమని వెంటపడి వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె ఫిర్యాదుపై అప్పటి ఎస్‌ఐ నారాయణ యాదవ్ కేసు రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో శిక్ష పడేలా చేసిన ఏపీపీ స్వప్నను అభినందిస్తూ, కోర్టు కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్, సుధాకర్‌ను ఎస్పీ హర్షవర్ధన్ అభినందించినట్లు తెలిపారు.

షాపులో చోరీ చేసిన మహిళలు

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 8: బట్టలు కొనేందుకు బట్టల షాపునకు వచ్చిన కొందరు మహిళలు చీరలు అపహరించుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. శ్రీరామ్‌నగర్‌లో చోటు చేసుకున్న ఘటన విషయానికి వస్తే... రెండు రోజుల కిందట కొందరు మహిళలు కారులో దుకాణానికి వెళ్లారు. అక్కడ కొన్ని చీరలను చూస్తూ కొద్దిసేపటి తర్వాత షాపు సిబ్బందిని మాటల్లో పెట్టి సుమారు లక్ష రూపాయలు విలువైన చీరలను అపహరించుకెళ్లారు. అనుమానం వచ్చిన యజమాని సీసీ కెమెరాలను పరిశీలించగా మహిళలు చోరీ చేసినట్లు వారు గుర్తించారు. ఈ క్రమంలో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

50 మందిపై కేసులు

రూ.3లక్షలు జరిమానా

కడప (నాగరాజుపేట), ఆగస్టు 8: పులివెందుల, కడప రూరల్ ప్రాంతాల్లో గురువారం ఏకకాలంలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు దాడులు జరిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న పలు ఇళ్ల, దుకాణాలపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. కడప విజిలెన్స్ అధికారి రమేశ్ ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టి అక్రమంగా విద్యుత్‌వినియోగిస్తున్న 40 మందిని విజిలెన్స్ అధికారులు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా విద్యుత్ చౌర్యం చేసే వారికి రూ.2లక్షలు జరిమానా విధించారు. విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, చౌర్యానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఈ మధులత, ఏఈలు రామాంజనేయరెడ్డి, మస్తాన్, రవి, నాగరాజు పాల్గొన్నారు.

విచారణ అధికారులతో సమస్య ఏకరువు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విచారణాధికారులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

బి.కోడూరు, ఆగస్టు 8: 'జిల్లా పరిషత్ హైస్కూలు తనఖా' శీర్షికపై విచారణాధికారులకు గ్రామస్థులు సమస్యను ఏకరువుపెట్టారు. మండలంలో ఇటీవల సంచలనం రేపిన 'జిల్లా పరిషత్ హైస్కూలు తనఖా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంపై స్పందించిన కలెక్టరు శివశంకర్ లోతేటి డిప్యూటీ తహసీల్దారు విద్యాసాగర్, వీఆర్వో గురప్ప, సచివాలయ సర్వేయరు ప్రవీణ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దీనిపై సచివాలయ సర్వేయరు ప్రవీణ్ తన తప్పులేదంటూ కలెక్టరుకు విన్నవించుకోవడంతో విచారణ నిమిత్తం కలెక్టర్ జిల్లా అసిస్టెంటు సర్వేయరు మురళీక్రిష్ణను పంపించారు. గోవిందాయపల్లె జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించేందుకు వచ్చిన అధికారికి గ్రామస్థులు ఏకమై మూకుమ్మడిగా ఏకరువు పెట్టారు. తప్పుడు పత్రాలకు సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలను ఆన్‌లైన్ చేయించుకుని వివిధ బ్యాంకుల్లో రుణాలు తెచ్చుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేయాలని అధికారులను కోరారు. స్పందించిన అధికారి నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని తదుపరి నిర్ణయం వారిదేనని వారు గ్రామస్థులకు తెలిపారు. వీరి వెంట డిప్యూటీ సర్వేయరు వెంకటేశ్, మండల సర్వేయరు భాస్కర్, సర్వేయర్లు పాల్గొన్నారు.

కేసు నమోదు...

గోవిందాయపల్లె 'జిల్లా పరిషత్ హైస్కూలు తనఖా' శీర్షికతో జిల్లా అధికారులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మున్నెల్లి గ్రామ పొలం సర్వే నెం.755లో 4 ఎకరాల 27సెంట్లు కొండా వెంకటసుబ్బమ్మ పేరుతో ఆన్‌లైన్ నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకుంటూ ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. మున్నెల్లి గ్రామ సర్వే నెం.755లో 4 ఎకరాల 27 సెంట్లు జిల్లా పరిషత్ హైస్కూలు స్థలమని, దానిని తప్పుడు డాక్యుమెంటు చూపి ఆన్‌లైన్ చేయించుకుని సహకార సొసైటీ బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.8 లక్షలు రుణం తీసుకున్న కొండా వెంకటసుబ్బారెడ్డి అతని భార్య కొండా వెంకటసుబ్బమ్మపై కేసు నమోదు చేయాలని కోరారు. బ్యాంకు రుణాన్ని అదే బ్యాంకు సూపర్‌వైజరు నారాయణరెడ్డి చెల్లించారని, వారిని సుండుపల్లెకు బదిలీ చేస్తూ కల్కెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్‌ఈబీ సిబ్బందిపై ట్రాక్టర్ల యజమానుల దాడి - కేసు నమోదు

జమ్మలమడుగు, ఆగస్టు 8: దిగువపట్నం కాలనీ శివార్లలో పెన్నానది వద్ద ఇసుకను ట్రాక్టర్లకు లోడు చేస్తున్నారని రాబడిన సమాచారం మేరకు గురువారం రాత్రి ఎస్‌ఈబీ సీఐ లత, సిబ్బంది వెళ్లినట్లు ఆమె తెలిపారు. దిగువపట్నం కాలనీ, పొన్నతోట పంచాయతీ మధ్య పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండాపోయిందని, పగలు, రాత్రి ఇసుక యజమానులు బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారని బహిరంగ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఇసుక విషయంలోనే గొడవలు జరిగి పలువురు గాయపడిన విషయం తెలిసిందే. అందులో భాగంగా సాయంత్రం రాబడిన సమాచారం మేరకు ఎస్‌ఈబీ సీఐ లత వారి సిబ్బంది దిగువపట్నం కాలనీ పెన్నానది వద్దకు వెళ్లారు. అక్కడ ట్రాక్టర్‌కు లోడు చేసి ఇసుకను తరలిస్తుండగా సీఐ, సిబ్బంది అడ్డుకున్నారు. అదే సమయంలో అక్కడున్న కె.క్రిష్ణమూర్తి అతని అనుచరులు మొత్తం 6 నుంచి 8 మంది ఎస్‌ఈబీ సీఐ లత, వారి సిబ్బందిపై దాడి చేసినట్లు ఆమె తెలిపారు. ఇందుకు సంబంధించి వెంటనే అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ లత, వారి సిబ్బంది ముగ్గురు కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి రాజకీయంగా ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా జమ్మలమడుగులో అడ్డు అదుపు లేని అక్రమ ఇసుక రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఇలా ఉంటే పోలీసులు అధికారులు విధులు నిర్వహించాలన్నా ఇబ్బందికరంగా మారుతోందని స్టేషన్ ఎదుట ఎస్‌ఈబీ సిబ్బంది వాపోయారు.

ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడప (మారుతీనగర్), ఆగస్టు 8: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కులాలు, ప్రాంతాల కోసం ఏకమౌతున్నారే తప్ప దేశంలో ఐక్యత కోసం సంఘటితమయ్యే నాయకులు కరువయ్యారన్నారు.

ఐక్యత కోసం 11, 12, 13న బైక్ ర్యాలీలు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని యావత్ భారతదేశం ఒకే మాట ఒకే బాటగా ఉండేలా బీజేవైఎం సారథ్యంలో బైక్‌ర్యాలీ చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలకృష్ణయాదవ్, వెంకటసుబ్బారెడ్డి, భానుప్రకాష్, గాలి హరిప్రసాద్, హరికృష్ణ, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

కనులవిందుగా అమ్మవారి గ్రామోత్సవం

● ఉత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారి మూలవిరాట్... ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

పులివెందుల టౌన్, ఆగస్టు 8: మున్సిపల్ పరిధిలోని పెద్దరంగాపురంలో అంకాళమ్మ తల్లి గ్రామోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వెల్లాల సీతారామశర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజైన గురువారం ఉదయ కలశారాధనతో పూజలు ప్రారంభమయ్యాయి. షోడచోవర పూజ, మహాస్నపనం, దుర్గా సూక్త హోమం నిర్వహించారు. అనంతరం అంకాళమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ ప్రజలు అందరుకలిసి కన్నులవిందుగా గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

మూడవ రోజు శుక్రవారం ఉదయం 10గంటల నుంచి ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.60వేలు, రెండవ బహుమతి రూ.40వేలు, మూడవ బహుమతి రూ.30వేలు, నాలుగో బహుమతి రూ.20వేలు, ఐదవ బహుమతి రూ.15 వేలు, ఆరవ బహుమతి రూ.10వేలు, ఏడవ బహుమతి రూ.8వేలు, ఎనిమివ బహుమతి రూ.6వేలు, తొమ్మివ బహుమతి రూ.5500, పోటీలో పాల్గొనన ప్రతి ఒక్కడికి రూ.5వేలు కన్సలేషన్ బహుమతిని అందించనున్నారు.

పులివెందుల ఎస్ఐగా అనిల్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



పులివెందుల టౌన్, ఆగస్టు 8: పులివెందుల అర్బన్ ఎస్ఐగా అనిల్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించా రు. సింహాద్రిపురం ఎస్ఐగా పనిచేస్తున్న ఈయన బదిలీపై పులివెందుకు వచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

మైసూరారెడ్డిని కలిసిన తులసిరెడ్డి



వేంపల్లె, ఆగస్టు 8: రాజ్యసభ మాజీ సభ్యుడు ఎంవీ మైసూరారెడ్డిని పీసీసీ మీడియా మాజీ చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి కలిశారు.గురువారం ఎర్రగుంట్లలోని ఆయన నివాసంలో కలిసి రాష్ట్ర రాజకీయాలు, ప్రస్తుత పరిస్థితిని చర్చించారు. కాంగ్రెస్‌నాయకులు వెంట ఉన్నారు.

డ్రిప్ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

సింహాద్రిపురం, ఆగస్టు 8: సబ్సిడీపై ఇచ్చే బిందు, తుంపర్ల సేద్య పరికరాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఉద్యానవన శాఖ విస్తరణాధికారి వీరారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 31,500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం పథకం అమలు చేయుటకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● డిప్యూటీ సీఎంతో ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి


డిప్యూటీ సీఎంను కలిసిన పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 8 : కమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని డిప్యూటీ సీఎం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కొనిదెల పవన్‌కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంతో పుత్తా మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గం అన్నివిధాలా వెనుకబడి ఉందన్నారు. అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి ఆదుకోవాలని తెలిపారు. ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గంలో అధిక శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, వర్షాలు రాక పంటలుఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని అందుకు ప్రభుత్వం నుంచి సహకారం కావాలని కోరారు. అదేవిధంగా రోడ్లు మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కూడా నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరినట్లు సమాచారం.

హామీలను అమలు చేయాలి

కడప (మారుతీనగర్), ఆగస్టు 8: ఎన్నికల ముందు చేనేత కార్మికులకిచ్చిన హామీలను అమలు చేయాలని టీడీపీ తొగటవీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడక చక్రధర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం విజయవాడలోని ఏపీ సెక్రటేరియట్‌లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆయన కలిసి విన్నవించారు. త్వరలో చేనేత కార్మికుల వెతలు తీరుస్తామని లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

తహసీల్దారును కలిసిన టీడీపీ నాయకులు

కమలాపురం రూరల్, ఆగస్టు 8 : ఇటీవల కమలాపురం మండల తహసీల్దారుగా బదిలీపై వచ్చిన తహసీల్దారు శివరామిరెడ్డిని ఆయన కార్యాలయంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో టీడీపీనాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమలాపురం మండలంలోని పలు గ్రామాల నుంచి పనులపై ఆఫీసుకువచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే వారి పనులు చేసి పెట్టాలని ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు. ఈయన వెంట దాది రామయ్య, శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'వార్డు సభ్యత్వాన్ని రద్దుచేయాలి'

వేంపల్లె, ఆగస్టు 8:వేంపల్లె మేజర్ పంచాయతీలోని పాలక మండలిలో కొత్తూరు మహేష్ వార్డు సభ్యునిగా కొనసాగుతున్నాడని, అలాగే ఫైబర్‌నెట్‌లో ఉద్యోగం చేస్తున్నాడని నిబంధనల ప్రకారం ఆయన వార్డు సభ్యత్వాన్ని రద్దుచేయాలని ఎంపీడీఓ దివిజను టీడీపీ యువ నాయకులు రజనీకాంత్‌రెడ్డి కోరారు. ఎంపీడీఓకు గురువారం ఫిర్యాదు అందించారు. వార్డు సభ్యునిగా ఉంటూ ఉద్యోగం చేయకూడదని, దీనిపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు.

వైవీయూ ఇన్‌చార్జ్ వీసీని తొలగించాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8: వైవీయూ ఇన్‌చార్జ్ వీసీని ప్రభుత్వం వెంటనే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, గుజ్జుల వలరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అభిరానంద్, చంద్ర, ఈశ్వర్‌రెడ్డి, అభిరాం పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించకుంటే చర్యలు'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8 :జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయకులు చరణ్, హరిబాబు, సాయి, శివ, ఇర్ఫాన్, శ్యాం, కిరణ్, సురేంద్ర పాల్గొన్నారు.

అర్చకులకు వేతనాలు పెంచడం హర్షణీయం

వేంపల్లె, ఆగస్టు 8: దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు దూపదీపనైవేద్యం కింద వేతనాలను రూ.10వేలకు పెంచడం అభినందనీయమని బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేతనాలు పెంచినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

కనీస వేతన ప్రణాళిక ఆనందకరం

కడప (కల్చరల్), ఆగస్టు 8: ఆదాయం తక్కువ గల ప్రైవేటు ఆలయాలలో అర్చకుల జాబితా సిద్ధం చేయాలని దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, ఉప కమిషనర్లకు ఆదేశాలివ్వడం ఆనందకరమని జిల్లా అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు పిడతల గోపాలకృష్ణశర్మ పేర్కొన్నారు. గురువారం రాజరాజేశ్వరిదేవి ఆలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

జీఓ జారీపై హర్షం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8 : ప్రైవేటు దేవాలయాల్లో ధూప, దీప నైవేద్యాలకు పదివేలు ఇచ్చేందుకు ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనరు జనార్ధన్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: బీటెక్ రవి


ప్రజల సమస్యలు వింటున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఆగస్టు 8: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్దత్తున తరలివచ్చి వినతిపత్రాలుసమర్పించారు. పింఛన్లు,రేషన్‌కార్డుల మంజూరు, విద్య, వైద్యం, ఉద్యోగం ఇప్పించాలని అర్జీలు సమర్పించారు. కొన్నిసమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసి పరిష్కరించాలని కోరారు. అన్ని సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామనిహామీ ఇచ్చారు.

జీఓ 117తో వర్క్ అడ్జెస్ట్‌మెంటును పునరాలోచించాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8 :ఉపాధ్యాయులకు జీవో 117 ప్రకారం వర్క్ ఎడ్జెస్టెమెంటు ద్వారా బదిలీలుజరపాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్. చెంగల్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాల విద్యకు కంటకంగా మారిన జీవో 117ను రద్దు చేయాలని కోరుతున్నప్పటికీ అదే జీవోతో వర్క్ అడ్జెస్ట్‌మెంటు చేస్తే పాఠశాలవిద్య మరింత దిగజారే అవకాశం ఉందన్నారు. కావున వెంటనే ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు జీవో 117 రద్దు చేసి రూల్ ఆధారిత ద్వారా వర్క్‌అడ్జెస్ట్‌మెంటు తీసుకురావాలని కోరారు.

మాజీ సైనికులకు ఇంటినివేశ స్థలాలివ్వాలి

కడప (మారుతీనగర్), ఆగస్టు 8: జిల్లాలో సుమారు 2 వేల మందికి పైగా మాజీ సైనికులున్నారని, వీరందరికీ ఒకే చోట 5 సెంట్ల చొప్పున ఉచితంగా కానీ లేదా ప్రభుత్వ అతి తక్కువ ధరకు కానీ ఇంటి నివేశ స్థలాలు కేటాయించాలని జిల్లా మాజీ సైనిక సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడు పిలిప్, కార్యదర్శి రాజశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్‌ను కడప కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

సమయపాలన తప్పక పాటించాలి: ఇన్‌చార్జ్ కమిషనర్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8 : కార్పొరేషన్ పరిధిలోని సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఇన్‌చార్జ్ కమిషనరు కె.రాకేశ్‌చంద్రం తెలిపారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. గురువారం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి కేటాయించిన సమయానికి సచివాలయంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఐడీ కార్డులు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి రామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

వల్లూరు, ఆగస్టు 8 :మండల పరిధిలోని తప్పెట్ల గ్రామంలో నేటి నుండి మూడురోజుల పాటు సీతారామ లక్ష్మణ హనుమత్సమేత ధ్వజ ప్రతిష్ఠకలశ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ పూజలు ఉంటాయని హోమాలు కూడా నిర్వహిస్తామని, అలాగే అన్నదానం కూడా ఉంటుందని తెలిపారు.

దళితులపై అగ్రవర్ణాల దాడులు ఆపాలి

కడప (నాగరాజుపేట), ఆగస్టు 8 : జిల్లాలో రోజురోజుకూ దళితులపై అగ్రవర్ణాల వారు దాడులు చేస్తూ దౌర్జన్యాలకు దిగుతున్నారని, వెంటనే అగ్రవర్ణాల వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని దళిత ఫోరం జిల్లా చైర్మన్ బూసిపాటి కిశోర్, దళిత ఫోరం నాయకుడు శ్రీరాములు హెచ్చరించారు. గురువారం దళిత సంఘం కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

కేరళ బాధితులకు నిధుల సమీకరణ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8 : కేరళ వాయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడ్డ దుర్ఘటన బాధితులకు రైల్వే గూడ్సు షెడ్డు హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిధులు సేకరించారు. గురువారం కడప రైల్వేస్టేషన్‌లో, పరిసర ప్రాంతాల్లో ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో నిధులు సేకరించారు. ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు బాదుల్లా, మహబూబ్‌బాషా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యావల్ల నష్టపోయిన కేరళ ప్రజలకు అండగా ఉండాలని ఈ సందర్భంగా కోరారు.

సుబ్రమణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

వేంపల్లె, ఆగస్టు 8: నాగులచవితి పర్వదినంను వేంపల్లెలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని పలుచోట్ల నాగులపుట్టకు ఉపవాస దీక్షతో పూజలు చేశారు. స్థానిక సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగులపుట్టకు పెద్దఎత్తున భక్తులు హాజరై పూజలుచేశారు. అనంతరం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామిని మొక్కుకున్నారు. ఆలయ పూజారి గిరి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. మండల వ్యాప్తంగా నాగులచవితిని జరుపుకున్నారు.

సింహాద్రిపురంలో...

మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నాగుల చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రేపు ఉదయం వరకు మహిళలు ఒక్క పద్దుతో ఉండటం విశేషం. శుక్రవారం ఉదయం పుట్టకు వెళ్లి పాలు పోసి వక్క పద్దు వదలటం ఆవాయితీ.

సీకేదిన్నెలో... నాగులచవితిని పురష్కరించుకుని మహిళలు నాగులకు ప్రత్యేక పూజలు చేశారు. చలిపిండి, నువ్వుల పిండితో పు ట్టవద్దకు వెళ్లి ప్రదక్షణలు నిర్వహించి పుట్టలో పాలు పో సి నైవేద్యం సమర్పించారు. మమ్మల్ని చల్లగా కాపాడాలని నాగులకు వేడుకున్నారు.

అవినీతిపై జేసీకి ఫిర్యాదు

వేంపల్లె, ఆగస్టు 8: వేంపల్లెపంచాయతీ కార్యాలయంలో అవినీతి అక్రమాలు జరిగాయని విచారించి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు బీజేపీ జిల్లా కార్యదర్శి గాలి హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గురువారం జేసీని కలిసి వినతిపత్రం అందించారు. కార్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగులు వేలాది రూపాయలు జీతం తీసుకుంటున్న పనిచేయడం లేదని తెలిపారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని, పట్టించుకోవడం లేదని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారిస్తే అవినీతి బయటపడుతుందని ఫిర్యాదులో తెలియజేశారు.

ప్రశాంతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు


చెన్నూరు: అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాఠశాల సిబ్బంది.. ఇనగలూరు పాఠశాల చైర్మన్‌గా ఎన్నికైన కౌసల్యదేవి... సింహాద్రిపురం: కమిటీ చైర్మన్లను ప్రకటిస్తున్న ఎంఈఓ 2 శారద

చెన్నూరు, ఆగస్టు 8 : మండలంలో గురువారం పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మొత్తం 43 పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులను పాఠశాలలకు ఆహ్వానించి వారి సమక్షంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. వారికి విద్యార్థుల తల్లిదండ్రులు మద్దతిచ్చి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మండల ఉపాధ్యక్షుడు, టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీలో అధ్యక్ష, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వారు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సీఐ నారాయణ యాదవ్ పర్యవేక్షించారు. చెన్నూరు బాలుర ఉన్నత పాఠశాల అధ్యక్షుడిగా సందానిబాషా, బాలికల ఉన్నత పాఠశాలకు సాదు కస్తూరి, బయనపల్లె, చినమాచుపల్లె, రామనపల్లె ఉన్నత పాఠశాలలకు ఎల్.రామతులసి, పి.సులోచన ఎం.మల్లిఖార్జున రెడ్డి, కొత్తగాంధీ నగర్ పాఠశాల నుంచి ఎన్.చిన్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మనుగా ఓసీ నుంచి ఆరుగురు, బీసీ నుంచి 11 మంది, ఎస్సీ 18, ఎస్టీ 4, మైనార్టీ 4 ఎన్నిక కాగా వైస్‌చైర్మన్‌గా ఓసీ 4, బీసీ 16, ఎస్సీ 15, ఎస్టీ 4, మైనార్టీ నలుగురు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నేత కొండపేట చిన్నిక్రిష్ణారెడ్డి, రవిశంకర్, ప్రధానోపాధ్యాయులు రత్నదేవి, వెంకటరామయ్య, పద్మనాభయ్య, ఉమామహేశ్వరి ఎన్నికయ్యారు.

ఆరు పాఠశాలలు ఏకగ్రీవం: కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8 : కడప నగరం 16వ డివిజనులో టీడీపీ ఇన్‌చార్జ్ ఏటూరు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆరు పాఠశాలలు ఏకగ్రీవమయ్యాయి. రామచంద్రయ్య కాలనీ ఎస్ఎంసీ చైర్మన్‌గా జోగినినే చంద్రకుమార్, బీఎస్ తాండ ఎస్ఎంసీ చైర్మన్‌గా చిన్నానాయక్, నాయనోరిపల్లె ఎస్ఎంసీ చైర్మన్‌గా పర్హానా, కొన్నేపల్లె ఎస్ఎంసీ చైర్మన్‌గా సుబ్బరాయుడు, సాయిబాబానగర్ ఎస్ఎంసీ చైర్మన్‌గా ఆవుల దేవేంద్రనాథ్, మేరీనగర్ ఎస్ఎంసీ చైర్మన్‌గా కమలను ఎన్నుకున్నారు.

సీకేదిన్నెలో... చింతకొమ్మదిన్నె మండలంలో మొత్తం 63 పాఠశాలలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 61 స్కూళ్లకు ఏకగ్రీవమైంది. రెండు పాఠశాలలో పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి వెంకటరామిరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా వి.గౌస్, వైస్ చైర్మన్‌గా బి.లక్ష్మీదేవి, సీకేదిన్నె ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా ఖైరూన్, వైస్‌చైర్మన్‌గా అలేఖ్య, మూలవంక ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా గిరిధర్, వైస్ చైర్మన్‌గా గులాబ్‌జాన్, ఆజాద్‌నగర్ ఉర్దూ స్కూల్ చైర్మన్‌గా గౌస్‌మొహిద్దీన్, వైస్‌చైర్మన్‌గా షబానా, ఆజాద్‌నగర్ ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా దస్తగిరి, వైస్ చైర్మన్‌గా రిజ్వానా, అశ్వర్థగారిపల్లె ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా లక్ష్మీప్రియాంక, వైస్ చైర్మన్‌గా శశికళలను ఎన్నుకున్నారు. ఇప్పెంట, బోడెద్దులపల్లె ఉర్దూ హైస్కూల్ చైర్మన్‌గా షేక్ మహబూబ్‌బాషలు ఎన్నుకున్నారు. అదే విధంగా అన్ని పంచాయతీల్లో, పాఠశాలల్లో చైర్మన్‌లు, వైస్ చైర్మన్లు ఎన్నుకున్నారు. పాఠశాల కమిటీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కమిటీ చైర్మన్‌గా కౌసల్యదేవి

పులివెందుల టౌన్, ఆగస్టు8: నియోజకవర్గంలోని తొండూరు మండలం ఇనగలూరు ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ చైర్మన్‌గా ది ద్దెకుంట కౌసల్యదేవి ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా కొప్పల సునీత ఎన్నికయ్యారు.హెచ్ఎం లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో...మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ కమిటీ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ- 2 శారద తెలిపారు. మండల పరిధిలో 38 పాఠశాలలకు గాను 10 పాఠశాల లు ఏకగ్రీవంగాను, 28 పాఠశాలలు ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నట్లు ఎంఈఓ తెలిపారు.

వేంపల్లెలో... మండలంలో ప్రశాంతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరిగాయని ఎంఈఓ జాఫర్ సాదిక్ తెలిపారు. మండలంలో 51 పాఠశాలలు ఉండగా 50పాఠశాలల్లో ఎన్నిక ఏకగ్రీవమైందన్నారు. పట్టణంలోని మెయిన్ స్కూల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

పెండ్లిమర్రిలో... మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 67 పాఠశాలలకు ఏకగ్రీవంగా చైర్మన్‌లు ఎన్నికయ్యారు. సీఐ నాగరాజు బందోబస్తు ఏర్పాటుచేశారు. మండల విద్యాశాఖాధికారి సుజాత పర్యవేక్షించారు.

వల్లూరులో... మండల పరిధిలోని 46 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓలు లిల్లెమ్మ తెలిపారు. ఎన్నికల పర్యవేక్షణకు జిల్లా నుండి సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి విశ్వనాథరెడ్డి నేతృత్వంలో సజావుగా నిర్వహించామన్నారు. అలాగే ఎంపీడీఓ పెద్దపుత్తలో జరుగుతున్న ఎన్నికల సరళిని పర్యవేక్షించారు.

వీరపునాయునిపల్లెలో...

మండలంలోని 48 పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారులు జాఫార్ సాదిక్, అనితలు తెలిపారు. ఎన్.పాలగిరి జడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా కలందర్ బాష, హోటూరు జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా పిఎం విష్ణునారాయణమ్మలు ఎన్నికయ్యారు. వీరిని టీడీపీ నాయకులు గోపీనాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పవన్‌కృష్ణ సత్కరించారు.

వేములలో...వేముల జడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా వల్లెపు వెంకటేష్ ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా సుమాంజలి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన స్కూల్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి చైర్మన్ వెంకటేష్‌ను సత్కరించారు.


వేముల: చైర్మన్ వెంకటేష్‌ను సత్కరిస్తున్న పార్థసారథిరెడ్డి... వీఎన్‌పల్లె: చైర్మన్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు... కడప: ఏటూరి రామచంద్రరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం... వల్లూరులో...

ప్రశాంతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు


బి.కోడూరు... తంగేడుపల్లె పాఠశాలలో చైర్మన్‌ను ఎన్నుకున్న దృశ్యం


బద్వేలులో...స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్


బద్వేలు...మన్మద్‌కాలనీలో ఎంపికైన చైర్మన్, వైస్‌చైర్మన్


గోపవరం... బ్రాహ్మణపల్లె పాఠశాలలో ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం


కాశినాయనలో చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న దృశ్యం


ప్రొద్దుటూరు... దస్తగిరి పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఎన్నికల ప్రక్రియను వివరిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఆగస్టు 8: ఎర్రగుంట్ల మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. కొన్ని పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా కొన్ని పాఠశాలల్లో గట్టిపోటీ ఇచ్చారు. ముందుగా మెంబర్ల ఎంపిక జరిగాయి. వారిద్వారా చైర్మన్ల, వైస్‌చైర్మన్ల ఎన్నికలు జరిగినట్లు హెచ్‌ఎం పద్మనాభరాజు తెలిపారు. ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అలాగే మండలంలోని 50పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను సీఐ నరేష్‌బాబు, ఎస్‌ఐలు పర్యవేక్షించి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూశారు.

కొండాపురం..: మండలంలో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.మండలంలో గురుకుల పాఠశాల తో కలిపి 52 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 49 చోట్ల ఎన్నికలు జరగగా, మూడు పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈవోలు ఓబులేసు, రామయ్య తెలిపారు. జడ్పీ హైస్కూల్, ఎంపీపీ, పొట్టిపాడు,జడ్పీ హైస్కూల్ టి.కోడూరు పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదాపడ్డాయన్నారు.

ముద్దనూరు..: మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు.35 ప్రాథమిక పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత, 6ఉన్నత పాఠశాలలకు చైర్మన్ల, వైస్‌చైర్మన్ల ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈవో నాగేశ్వరనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజుపాలెం..: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈవో ఓ.రామస్వామిరెడ్డి తెలిపారు. కుమ్మరిపల్లె, అయ్యవారు పల్లెప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా పాఠశాల్లో చైర్మన్ల, వైస్‌చైర్మన్ల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మండలంలో 28 ప్రాథమిక పాఠశాలుల, రెండు అప్పర్ ప్రైమరీపాఠశాలలు, 8 జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలు, వెల్లాల బాలికల గురుకులపాఠశాలలో ఎన్నికలు జరిగాయి. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ల, వైస్‌చైర్మన్లతో పాటు ఎక్స్ అఫీషియో మెంబరు, కో-ఆప్షన్‌మెంబరును ఎన్నుకున్నట్లు తెలిపారు.

జమ్మలమడుగు..: మండలంలో 58 పాఠశాలల్లో చైర్మన్ల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎంఈవో రమణారెడ్డి మాట్లాడుతూ పాఠశాల చైర్మన్ల ఎన్నిక కోరం ఉంటేనే జరుపుతామని తెలిపారు. ఎట్టకేలకు అన్ని పాఠశాలల్లో చైర్మన్ల పక్రియ సజావుగా ముగిసిందన్నారు. అందులో ప్రైమరి స్కూళ్ల 40, యూపీ స్కూల్ 5, హైస్కూలు 13 మొత్తం 58 పాఠశాలల్లో చైర్మన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఎంఈవోలు రమణారెడ్డి, చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ సుబ్బారావు వారి సిబ్బంది పర్యవేక్షించారు.

మైలవరం..: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ చిట్టిబాబు తెలిపారు. మండలంలో 43 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత,7 హైస్కూళ్లలో విద్యా కమిటీ చైర్మన్ల, వైస్‌చైర్మన్ల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఈవో చిట్టిబాబు మండలంలో పర్యటించి ఆయా స్కూళ్లలో పర్యటించారు.

అట్లూరు..: అట్లూరు మండలంలో మూడు ఉన్నతపాఠశాలలు అట్లూరు, కమలకూరు, సోమేశ్వరపురం కేజీబీవీ, అట్లూరు ఎంపీ యూపీ పాఠశాలలు, రెడ్డిపల్లెమన్యం వారిపల్లె కోనరాజుపల్లె 36 ప్రాథమిక పాఠశాలల్లో స్కూలు యాజమాన్యం చైర్మన్ల, వైస్‌చైర్మన్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఈవో విలియం రాజు, ఎంఈవో 2 ఖాదర్‌వల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అట్లూరు మండల టీడీపీ అధ్యక్షులు పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: విద్యాకమిటీ చైర్మన్లకు సంబంధించి రెండు చోట్ల మినహా మండలమంతా ప్రశాంతంగా జరిగింది. పోరుమామిళ్ల మండలంలో విద్యాకమిటీ చైర్మన్ల ఎన్నికలకు సంబంధించి పుల్లీడు ఎంపీపీ పాఠశాల, సిద్దనకిచ్చాయపల్లె (కొత్తూరు)మినహా మిగిలిన చోట్ల అంతా ప్రశాంతంగా ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి.

బి.కోడూరు..: బి.కోడూరు మండల పరిధిలో మొత్తం పాఠశాలలు 38 ఉండగా, వాటన్నింటిలో టీడీపీ మద్దతుదారులే ఎన్నికయ్యారు. మేకవారి పల్లె, నగిలేరు గురుకుల పాఠశాల ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈవో సునీల్‌కుమార్ తెలిపారు. ఈ కమిటీల్లో ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బద్వేలు..: బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని కొన్ని మండలాలలో కోరం లేక వివిధ కారణాల చేత వాయిదా పడ్డాయి. వాయిదా పడ్డ విద్యాకమిటీకి సంబంధించి తిరిగి ఎన్నికలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఆయా పాఠశాలల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బద్వేలు రూరల్..: బద్వేలు మండల పరిధిలో ఉన్న మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలో 65 మండల ప్రజాపరిషత్ పాఠశాలలు ఉండగా 63 పాఠశాలల ఎన్నికలు ముగిసినట్లు రెండు మాత్రం వాయిదాపడినట్లు ఎంఈవో ప్రమీల తెలిపారు. అలాగే మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

పెద్దముడియం..: మండల వ్యాప్తంగా గురువారం జరిగిన స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా ముగిశాయి. మండలంలో మొత్తం 38 పాఠశాలలున్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 28, ప్రాథమికోన్నతపాఠశాలలు 3, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు 6, 1 కస్తూర్బాపాఠశాల ఉంది. అన్ని పాఠశాలల్లో చైర్మన్ల, వైస్‌చైర్మన్ల సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా అయ్యాయని అధికారులు తెలిపారు.

గోపవరం..: మండల పరిధిలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలో 64 మండల ప్రజాపరిషత్ పాఠశాలలు ఉండగా 60 పాఠశాలల ఎన్నికలు ముగిసినట్లు నాలుగు పాఠశాలలు వాయిదా అయినట్లుగా ఎంఈవో తెలిపారు. భూమిరెడ్డిపల్లె, కాలనీ2, లక్కవారిపల్లె, పెద్దపోలుకుంట వాయిదా పడినట్లు ఎంఈవో తెలిపారు.

కాశినాయన..: మండలంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈవో ఓ.నిర్మల తెలిపారు.మొత్తం 39 పాఠశాలలకు గాను 37 పాఠశాలల్లో టీడీపీ మద్దతుదారులు జయకేతనం ఎగురవేశారు. నర్సాపురం జడ్పీఎన్నికలను తహసీల్దారు బాల నరసింహులు పర్యవేక్షించారు.

ప్రొద్దుటూరు టౌన్..: ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ఉన్న 110 పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్నికలు నిర్వహించారు. కల్లూరు జడ్పీ హైస్కూల్, ఎస్‌వీవీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కోరం లేకపోవడంతో ఎన్నికలను శుక్రవారంకు వాయిదా వేశారు. 23 పాఠశాలలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మిగిలిన పాఠశాలలో నామమాత్రపు పోటీ జరిగింది. అయిదారు పాఠశాలలో చైర్మన్ల, వైస్‌చైర్మన్ల ఎంపికకు గట్టి పోటీ జరిగింది. అసిస్టెంట్ సీఎంవో దశరథరామిరెడ్డి, అసిస్టెంట్ ఏఎంవో రామాంజనేయరెడ్డి, ఎంఈవో సావిత్రమ్మలు చెన్నంరాజుపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతోపాటు మరికొన్ని పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలను పర్యవేక్షించారు. ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని పాఠశాలల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు మున్సిపాలిటీ,మండలంలో స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ప్రైమరీ స్కూల్స్ 83,అప్పర్ ప్రైమరీ స్కూల్స్ 2,హైస్కూల్స్ 12 మొత్తం 97 పాఠశాలలో కమిటీ ఎన్నికలు జరిగాయి. అందులో 55 ఎకగ్రీవంగా చైర్మన్ల, వైస్‌చైర్మన్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరిబాబు,ధనపాల జగన్,కాలువ గురప్ప తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు సంబంధించి మొత్తం 62 పాఠశాలల్లో యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈవో రవిశంకర్ పేర్కొన్నారు. రేపల్లె, బసిరెడ్డిపల్లె గ్రామాల్లోని పాఠశాలలకు కోరం లేనందున ఎన్నికలు నిర్వహించలేదన్నారు. ఎస్‌ఐ కొండారెడ్డి, పోలీసులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఖాజీపేట..: మండల పరిధిలో 73 స్కూళ్లకు జరిగిన ఎన్నికల్లో అన్ని స్కూళ్ల ఏకగ్రీవంగా చైర్మన్ల, వైస్‌చైర్మన్లను ఎన్నుకున్నారు. మండల పరిధిలో ఎటువంటి ఘర్షణలు జరగకపోవడంతో పోలీసులు, విద్యాశాఖాధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

బ్రహ్మంగారిమఠం..: బ్రహ్మం గారిమఠం మండలంలో 59 పాఠశాలలకు విద్యాకమిటీ చైర్మన్ ఎన్నికలు నిర్వహించినట్లు దవనం పుల్లయ్య, ఎంఈవో -1 ఎం.వెంకటేశ్వర్లు, ఎంఈవో- 2లు తెలిపారు. అందులో మల్లేపల్లె పంచాయతీకి సంబంధించిన ఎద్దులాయపల్లె పాఠశాలలో వాయిదా వేసినట్లు తెలిపారు. 58 చోట్ల ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించినట్లు తెలపారు.


పోరుమామిళ్లలో...


ఎర్రగుంట్ల.. పోట్లదుర్తిలో ఎంపికైన ఎస్ఎంసీ చైర్మన్‌తో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


కొండాపురం మండలం చౌటిపల్లె జడ్పీహైస్కూల్‌లో ప్రమాణం స్వీకారం చేయిస్తున్న ఎంఈవో ఓబులేసు తదితరులు


ముద్దనూరు.. చైర్మన్‌తో ఎంపీడీవో, ఎంఈవో, ఉపాధ్యాయులు


రాజుపాలెం... ఎన్నికల్లో పాల్గొన్న ఎంఈవో రామస్వామిరెడ్డి


జమ్మలమడుగులోని పొన్నతోటలో ఎన్నికైన పాఠశాల కమిటీ చైర్మన్


మైలవరం... చైర్మన్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు




మైదుకూరు.. కేశలింగాయపల్లె స్కూల్‌లో చైర్మన్, వైస్‌చైర్మన్, చాపాడులో ఎన్నుకున్న కమిటీ సభ్యులు, ఖాజీపేట...ఎన్నికైన చైర్మన్


అట్లూరు... రెడ్డిపల్లెలో స్కూలు కమిటీ ఎన్నిక

నేడు, రేపు
ఉచిత మంచినీటి సరఫరా నిలిపివేత

జమ్మలమడుగు, ఆగస్టు 8: జమ్మలమడుగు పట్టణంలో ఈనెల 9, 10 తేదీల్లో మున్సిపాలిటీలోని దొమ్మరనంద్యాల పంప్‌హౌస్ క్లీనింగ్ కారణంగా రెండు రోజులపాటు మంచినీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని ఆయన కోరారు.

సచివాలయం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నీలం రామ్‌చరణ్

మైదుకూరు రూరల్ ఆగస్టు 8 : గ్రామ,వార్డు సచివాలయం ఉద్యోగుల సమాఖ్య (339-2023) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నీలం రామ్ చరణ్ నియమితులైనట్లుగా విలేకరుల సమావేశంలో తెలిపారు .విజయవాడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఎన్నికలు జరిగాయి. చరణ్ దువ్వూరు-2 సచి వాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. సంఘంలోని ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికీ ముందుండి కృషి చేస్తానని తెలిపారు.

పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 8 : మండల కేంద్రంలోని కొత్తబస్వాపురం గ్రామంలో గురువారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని జిల్లా పశు గణాభివృద్ధి ఉప సంచాలకుడు డాక్టర్ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులు పశువులకు ఎదసూదులు వేసుకోవాలనుకునే వారు ప్రభుత్వానికి రూ.500 చెల్లించి వైద్యం పొందవచ్చన్నారు ఈ కార్యక్రమంలో బి.మఠం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు వెంకటసుబ్బయ్య, పశువైద్యాధికారులు డాక్టర్ బి.నిత్యానంద్, డాక్టర్ ఎం.లక్ష్మీనరసయ్య, డాక్టర్ బి.శివరామిరెడ్డి, పశుసంవర్ధక సహాయకులు గోపాలమిత్రలు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి : ఏడీఏ

ఎర్రగుంట్ల, ఆగస్టు 8: ఖరీఫ్‌లో వేసిన పంటలకు ప్రతి రైతు ఈ క్రాపింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పెద్దనపాడు గ్రామాల్లోని పొలాల్లో పర్యటించి రైతులకు పంటల సాగుపై పలు సూచనలు చేశారు. దుక్కిలో ఎటువంటి ఎరువులు వేయని రైతులు ఎకరాకు 50కేజీల డీఏపిని, 25కేజీల పొటాష్‌ను వేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఈ-క్రాపింగ్ చేయించుకోవాలన్నారు.

11న వీఆర్వోల సర్వసభ్య సమావేశం

జమ్మలమడుగు, ఆగస్టు 8: ఈనెల 11వ తేదీ విజయవాడలోని గాంధీనగర్‌లోని హోటల్ శ్రీరాం (స్వర్ణప్యాలెస్) వద్ద ఉదయం 11 గంటలకు రిటైర్డు వీఆర్వో, వీఏవో సంఘం సర్వసభ్య సమావేశం జరుగనున్నట్లు జిల్లా రిటైర్డు వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.ఖాదర్‌బాష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డు వీఆర్వో, వీఏవోల సమస్యలపై రేషన్‌కార్డుల పునరుద్ధరణ, పెన్షన్ పంపుదల తదితర సమస్యలను సమావేశంలో చర్చిస్తామన్నారు.

గడప గడపకు స్టీల్ ప్లాంట్ ఉద్యమం

ప్రొద్దుటూరు ,ఆగస్టు 8 : రాయలసీమ వెనుకబాటుతనం పోవాలంటే ఇక్కడి నిరుద్యోగ యువతకు భవిష్యత్తు వుండాలంటే స్టీల్‌ప్లాంట్‌నిర్మాణం జరగాలని యునైటెడ్ ఫోరం కన్వీనర్ ఎస్నెస్ ఖలందర్ డిమాండ్ చేశారు. గురువారం విజయకుమార్ సర్కిల్లో గడప గడప కు స్టీల్‌ప్లాంట్ ఉద్యమం పేర స్ట్రీట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగ స్టీల్‌ప్లాంట్ ఉద్యమ కరపత్రాలు పంపిణీ చేశారు. స్టీల్ ప్లాంట్ ఉద్యమంకు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు మద్దతు పలికి ఉద్యమంలోకి కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి శివారెడ్డి,దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, పీకేఎస్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి , విద్యావంతుల వేదిక కన్వీనర్ మహమూద్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పుట్టా పరామర్శ

ఖాజీపేట, ఆగస్టు 8: మండల పరిధిలోని అప్పనపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నాగార్జునయాదవ్ బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ నాగార్జునయాదవ్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, హరినాథరెడ్డి, జెండాల మాబాష, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ విత్తన ఉత్పత్తి పథకం శిక్షణ కార్యక్రమం

కలసపాడు, ఆగస్టు 8 : కలసపాడు మండలం మహానందిపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలో యాజమాన్య పద్ధతులు, కాలిబాటల వల్ల ప్రయోజనాలు, విత్తనశుద్ధి , నారు కొనలు తుంచి నాటడం వల్ల ప్రయోజనాలు వివరించడం జరిగింది. వరి నారు శుద్ధి చేయడం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి ఎం.శివశైలజ, ఏవో ఎస్.జాకీర్‌షరీఫ్, గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎం.అశోక్‌కుమార్‌రెడ్డి, ఎం.నాగరత్న, బి.శివ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దిన విద్యావేత్త కేవీఆర్
కేవీఆర్ వర్ధంతికి మొక్కలు నాటిన ఎమ్మెల్యే వరద, శశిభూషణ్‌రెడ్డి


మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, శశిభూషణ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి

ప్రొద్దుటూరు , ఆగస్టు 8 : గోపిక్రిష్ణ విద్యా సంస్థల ద్వారా దశాబ్దాలుగా ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన విద్యావేత్త కోనేటి వెంకట రమణారెడ్డి అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కొనియాడారు. గురువారం స్థానిక దొరసానిపల్లెలోని గోపిక్రిష్ణ సెంట్రల్ స్కూల్లో ఆ సంస్థ వ్యవస్థాపకుడు కేవీ రమణారెడ్డి తృతీయ వర్థంతిని విద్యాసంస్థల చైర్మన్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కోనేటి క్రిష్ణప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రమణారెడ్డి విద్యా సంస్థలు నడుపుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా కేవీఆర్ కుమారులు క్రిష్ణప్రదీప్‌రెడ్డి సందీప్‌రెడ్డి 500 మందికి నిత్యావసర సరుకులు, పూల మొక్కలు ఉచితంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి అందజేశారు. అనంతరం ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుమేరకు స్కూలు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ పర్లపాడు గౌరీ శంకర్, రవి,గురు, కొండయ్య, విక్రాంత్ ,ప్రైవేటు స్కూళ్ల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు

ఎర్రగుంట్ల, ఆగస్టు 8: ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా వారి పనులను చేసిపెట్టాలని తహసీల్దార్ శోభన్‌బాబుకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం.సురేష్‌నాయుడు సూచించారు. గురువారం ఎర్రగుంట్ల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శోభన్‌బాబు సీఎంసురేష్‌నాయుడును కలిశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు.

రాయలసీమకు గోదావరి జలాలు ఎత్తి పోయడం అర్థరహితం
రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రతినిధులు

ప్రొద్దుటూరు ,ఆగస్టు 8 : రాయలసీమకు గోదావరి జలాలు ఎత్తిపోతల ద్వారా అందజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం అర్థ రహితమని రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రతినిధులు మహమూద్, వరలక్ష్మీ, పద్మ , హమీద్ తప్పుబట్టారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ పోలవరం నుంచి గోదావరి జలాలను నాగార్జున సాగర్‌కు తీసుకొచ్చి అక్కడినుంచి శ్రీశైలానికి ఎత్తి పోసి పోతిరెడ్డి పాడు ద్వారా గాలేరు నగరి హంద్రీనీవా ప్రాజెక్టుకు అందిస్తామని సాధ్యంకాని వాగ్దానాలు చంద్రబాబు చెప్పి రాయలసీమ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు.